క్లుప్తంగా

మంచి ఉద్యోగిగా గుర్తింపు పొందాలి



పదవీ విరమణ చేసిన ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తి దంపతులను సన్మానిస్తున్న డీఎస్పీ కంజాక్షన్

హిందూపురం: విధి నిర్వహణలో పదవీ విరమణ సర్వసాధారణం. అయితే మంచి పనులతో గుర్తింపు పొందడానికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని డీఎస్పీ కంజాక్షన్ అన్నారు. సోమవారం ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రామ్మూర్తి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామ్మూర్తి దంపతులను డీఎస్పీ సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ట్రాఫిక్ ఏఎస్ఐ, ఎస్ఐగా రామ్మూర్తి సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ఎస్ఐ రామ్మూర్తి దంపతులను సహ ఉద్యోగులు సన్మానించి పదవీ విమరణ శుభాకాంక్షలు తెలియజేశారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

అమరాపురం: మండల పరిధిలోని ఆలదపల్లి చెక్ పోస్టు సమీపంలో సోమవారం బైక్‌పై వెళ్తున్న హనుమంతప్పను వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. హనుమంతప్పకు రక్తగాయాలతో రోడ్డుపైనే పడిపోయారు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం ద్వారా వెంటనే బాధితుడిని చికిత్స నిమిత్తం మడకశిర ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ మూర్తి, పైలెట్ పురుషోత్తం తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం



విశ్రాంత ఉద్యోగులను సన్మానించిన దృశ్యం

పావగడ: ఇటీవల పదవీ విరమణ పొందిన తాలూకాలోని దొడ్డేనహళ్లి గ్రామానికి చెందిన ఆర్టీఓ తిప్పేస్వామి, బెంగళూరులోని కుమార కృప ప్రభుత్వ అతిథి గృహం వ్యవస్థాపకురాలు పద్మావతి గోవిందయ్యలను స్థానిక వాల్మీకి సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. నిడుగల్ వాల్మీకి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో వాల్మీకి సంజయకుమార స్వామి మాట్లాడుతూ విశ్రాంత ఆర్టీఓ తిప్పేస్వామి, పద్మావతి గోవిందయ్య పేద కుటుంబంలో జన్మించి అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని కష్టపడి చదువుకుని విద్యావంతులై ఉన్నత ఉద్యోగాల్లో రాణించి సామాజిక సేవల్లో పాల్గొన్నారని కొనియాడారు.

ఆలయ కమిటీ రాజీనామా

హిందూపురం: హిందూపురం మెయిన్‌బజారులోని పేట వెంకటరమణస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తమ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. దేవదాయ ధర్మదాయశాఖ కమిషనర్‌కు ఈ మేరకు రాజీనామాలు పంపించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌చంద్ర, సభ్యులు లక్ష్మీదేవి, భారతి, వి.రత్న, చంద్రమోహన్, గోపాల్, రామ్మూర్తి తమ పదవులకు రాజీనామా చేశారన్నారు. రాజీనామా విషయంపై దేవదాయశాఖ కమిషనర్ నిర్ణయం తీసుకుంటారన్నారు.

ఘనంగా పాంచజన్య స్కూల్ వార్షికోత్సవం



కేక్‌కట్ చేస్తున్న స్కూల్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు

హిందూపురం: పట్టణంలోని పాంజన్య స్కూల్ 22 వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రెసిడెంట్ పాంచజన్య శ్రీనివాసులు 69వ జన్మదినం సందర్భంగా ఆ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య శ్రీనివాసులు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, స్కూల్ కరస్పాండెంట్, కోశాధికారి నందకుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి ఏఓ భాస్కర్, స్కూల్ సూపరింటెండెంట్ విజయేంద్ర పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

20న ఉచిత గుండె వైద్య శిబిరం

నల్లచెరువు: గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా గుడి ట్రస్ట్ ఆధ్వర్యంలో మదనపల్లికి చెందిన శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్ సహకారంతో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ బాల కిషోర్ ఈ నెల 20న నల్లచెరువులోని సాయిబాబా గుడి వద్ద ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నారు. షుగర్, బీపీ, ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- బక్రీద్ విశిష్టతను తెలియజేసిన ముస్లిం మత పెద్దలు



గోరంట్ల: ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



హిందూపురం: ఈద్గాలో ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక బక్రీద్



హిందూపురం: శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



రొద్దం: ఈద్గాలో ప్రసంగిస్తున్న ముస్లిం మత పెద్ద

హిందూపురం: ప్రేమానురాగాలు త్యాగం, దాన గుణాలను అలవర్చుకుని దైవంపై భక్తిభావాన్ని పెంచుకున్నవారే అల్లాకు ప్రీతిపాత్రులు అవుతారని మతపెద్ద మౌలానా అబ్దుల్ మన్నన్‌సాబ్ అన్నారు. బక్రీద్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం హిందూపురంలో ఈద్ ఉల్ అజ్‌హను ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు పెద్ద ఎత్తున అల్‌హిలాల్, మేళాపురం, నింకంపల్లి ఈద్గాల వద్ద చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మతపెద్దలు ప్రసంగిస్తూ ఖుర్బానీలు అన్నీ దైవాన్ని చేరలేవని, కేవలం భయ భక్తులు ప్రేమభావంతో కూడిన దైవప్రార్థనలు, దానాలు, త్యాగాలు మాత్రమే దైవ కృపాకు చేరువ చేస్తాయని చెప్పారు. ధర్మం కోసం త్యాగం చేయాలని అదే ఖుర్బానీ సంప్రదాయమని స్పష్టం చేశారు. అనంతరం విశ్వశాంతి కోసం ప్రార్థనలు చేశారు.

సోమందేపల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి, పత్తికుంటపల్లి, సోమందేపల్లి గ్రామాల్లో బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ఈద్గా మైదానాలకు వెళ్లి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేదలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు, పంపిణీ చేశారు.

పెనుకొండ: మండల వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకున్నారు. పట్టణంలో ఉన్న ఈద్గా మైదానంలో ఉదయం 8 గంటకే ముస్లింలతో కిటకిటలాడింది. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రొళ్ల: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ముస్లింలు భక్తిభావంతో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. రొళ్ల, ఆవినకుంట, రత్నగిరి, దొడ్డేరి, గొట్టుగుర్కి, హొట్టేబెట్ట, ఎం.రాయాపురం, హెచ్‌టీ హళ్లి, బీజీ హళ్లి తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రొద్దం: బక్రీద్ పండుగను పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని స్థానిక జామియా మజీద్ నుంచి పావగడ-పెనుకొండ ప్రధాన రహదారి పక్కనున్న ఈద్గా వద్దకు ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీగా చేరుకున్నారు. ముతవల్లీ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గుడిబండ: మండల పరిధిలో గుడిబండ, మందలపల్లి, మద్దనకుంట తదితర గ్రామాల్లో బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ఊరేగింపుగా మసీదులు, ఈద్గాల వద్దకు వెళ్లి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరూ దాన గుణం, సేవాగుణం అలవర్చుకోవాలని మత పెద్దలు సూచించారు. బక్రీద్ విశిష్టతలో భాగమైన ఖుర్బానీని చుట్టుపక్కల వారికి దానంగా అందజేశారు.

గోరంట్ల: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను మండల వ్యాప్తంగా ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే ఆయా గ్రామాల్లోని మసీద్‌లు, ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గోరంట్ల ప్రత్యేక ర్యాలీ చేశారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం కబరాస్తాలో మృతి చెందిన తమ వారికి నివాళులర్పించారు.

పరిగి: మండలంలో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముతవల్లీలు, మతపెద్దల ఆధ్వర్యంలో ఈద్గా మైదానానికి వెళ్లారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పండుగ సందర్భంగా మాంసాన్ని దానం చేశారు.

అగళి: బక్రీద్ సందర్భంగా మండల కేంద్రంలోని ఈద్గా మైదానాల్లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు ప్రసంగిస్తూ పండుగ రోజునే కాకుండా నిత్యం చేసిన ప్రార్థనలు, దానాలు, త్యాగాలు దైవకృపకు చేరువ చేస్తాయన్నారు.

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షితో పాటు కల్లూరు, శిరివరం, పులమతి, మైదుగోళం, మానేపల్లి, నాయనిపల్లి, కోడిపల్లి తదితర గ్రామాల్లో బక్రీద్ పండగను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ముస్లిం సోదరులు ఈద్గా మైదానాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు.

పావగడ: త్యాగం, ధర్మానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ (ఈద్ ఉల్ హజ్) పర్వదినం వేడుకలను సోమవారం పావగడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది ముస్లిం భక్తులు పెనుగొండ ఊరు వాకిలి నుంచి ఊరేగింపుగా ఈద్గా మైదానానికి చేరుకున్నారు. అక్కడ సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ సురేశ్‌ను మత పెద్దలు ఘనంగా సత్కరించారు.

అమరాపురం: బక్రీద్ వేడుకను మండల వ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయమే ముస్లింలు మసీదు నుంచి ర్యాలీగా ఈద్గా మైదానానికి చేరుకున్నారు. ముస్లిం పెద్దలు సామూహిక ప్రార్థనలు జరిపారు.

పెనకొండ రూరల్: మండలంలోని గుట్టురూ, చంద్రగిరి, శెట్టిపల్లి, మావటూరు గ్రామాల్లో బక్రీద్‌ను పురస్కరించుకొని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు బక్రీద్ విశిష్టతను తెలియజేశారు. మత పెద్దలు అల్లాబకాష్, బషీర్, రిజ్వాన్, సీఎం బాషా, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలియజేసిన ప్రముఖులు

మడకశిర: పట్టణంలో బక్రీద్ వేడుకను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన రోడ్డు గుండా ముస్లింలు ర్యాలీగా ఈద్గా మైదానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పేదలకు దానాలు చేశారు. హిందువులు కూడా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసి మతసామరస్యాన్ని చాటారు. ఇదిలా ఉండగా బక్రీద్ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ మంత్రులు రఘువీరారెడ్డి, నర్సేగౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ తిప్పేస్వామి, వైటీ ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



అగళి: ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



లేపాక్షి: ఈద్గా మైదానంలో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



గుడిబండ: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పావగడ: ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



రొళ్ల మండలం ఆర్.వద్రహట్టి వద్ద ...

బక్రీద్ సందర్భంగా రక్తదానం



బక్రీద్ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం: రక్తదానం మానవ సంబంధాలను బలపేతం చేస్తుందని అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారుఖ్‌ఖాన్ అన్నారు. బక్రీద్ సందర్భంగా లైఫ్ వరల్డ్ కన్వీనర్ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో హిందూ ముస్లింల ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం జరిగింది. రక్తదాతలకు పురస్కారం అందజేశారు. అనంతరం రోగులను పరామర్శించారు. కార్యక్రమంలో డాక్టర్లు చరణ్, శివ కుమార్, ఉబేదుల్లా హుసేన్, చైతన్య గంగిరెడ్డి, ఇదరీస్, రహమాన్, రక్తదాతలు శ్రీనాథ్, దిలీప్, నాజిమ్ తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండ మండలం గుట్టూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



అమరాపురం: ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సోమందేపల్లి: ఈద్గా మైదానానికి ఊరేగింపుగా వెళ్తున్న ముస్లింలు

ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు



ప్రమాదానికి కారణమైన బస్సు



గాయపడిన మహిళలు

- 8 మందికి గాయాలు

పావగడ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొమ్మతమరి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది కూలీలు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రొద్దం నుంచి దొమ్మతమరి మీదుగా హిందూపురానికి వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఎదురుగా ప్రయాణీకులతో వస్తున్నను ఉదయం 7 గంటల సమయంలో ఆటోను ఢీ కొంది. దీంతో మడకశిర మండలం రేకులకుంటకు చెందిన ఆటోలోని 8 మంది కూలీలు తీవ్రగాయాల పాలయ్యారు. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండటంతో తుమకూరు ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంఘటన పై కేసు నమోదైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మూడు గొర్రెలు మృతి

తలుపుల : బండ్లపల్లి పంచాయతీలోని ఎగువ హరిజనవాడ ఉత్తన్నకు చెందిన 3 గొర్రెలు విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాయి. బాధితుడు తెలిపిన మేరకు... ఊరికి పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేపుతుండగా మూడు గొర్రెలు విద్యుదాఘాతానికి గురయ్యాయి. ఊరిలో వారు వచ్చి చూడగా అప్పటికే అవి చనిపోయాయని బాధితుడు తెలిపాడు. రూ.60 వేల దాకా నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిసాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

ద్విచక్ర వాహనం అపహరణ

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ఆంధ్రా బ్యాంక్ ఎదుట నివాసం ఉంటున్న చింతల నాయుడు ఇంటి ఆవరణలో పార్క్ చేసిన స్కూటీ ఆదివారం రాత్రి చోరీ అయ్యింది. ఈ మేరకు బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి దొంగను గుర్తించినట్లు తెలుస్తోంది.



దుర్గాదేవి



అలంకరణలో వీరభద్రస్వామి

వీరభద్రస్వామి ఆలయంలో పూజలు

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అదేవిధంగా అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగం, మహా మంగళహారతి ఇచ్చారు.

ముందస్తు పంటలు కళకళ



మొలకెత్తిన వేరుశనగ



కళకళలాడుతున్న జొన్న పంట

మడకశిర: నియోజకవర్గంలో రైతులు ముందస్తుగా సాగు చేసిన వివిధ పంటలు కళకళలాడుతున్నాయి. మే చివరిలో, జూన్ ప్రారంభంలో వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలను సాగు చేయడానికి అవకాశం ఏర్పడింది. ముందస్తుగానే రైతులు పంటను సాగు చేశారు. నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో దాదాపు 380 హెక్టార్లలో రైతులు వేరుశనగ పంటను ముందుగా సాగు చేశారు. మడకశిర, గుడిబండ, అమరాపురం, అగళి మండలాల్లో వేరుశనగ వేశారు. ప్రస్తుతం వేరుశనగ విత్తనాలు మొలకెత్తి పంట కళకళలాడుతోంది. అంతే కాకుండా రైతులు ఈ ఏడాది మూగజీవాలకు మేత కోసం జొన్న పంటను కూడా ముందస్తుగానే సాగు చేశారు. పంట సాగు చేసినప్పటి నుంచి కూడా వర్షాలు ఆశాజనంగా పడ్డాయి. దీంతో జొన్న పంట ఎదగడానికి అవకాశం ఏర్పడింది.